నమస్తే తెలంగాణ
# యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 10 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

## దండుమల్కాపురంలో టీజీఐఐసీకి 6.23 ఎకరాలు

- రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురంలోని ఇండస్ట్రియల్ పార్కు కోసం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కి రాష్ట్ర ప్రభుత్వం 6.23 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ శుక్రవారం జీవో74 జారీ చేశారు. దండుమల్కాపురంలోని సర్వే నంబర్లు 682, 693, 697, 699, 701, 707, 708. 709, 714, 716, 717నంబర్లలో భూమి కేటాయింపు కోసం యాదాద్రి కలెక్టర్ అలియనేషన్ ప్రపోజల్ పంపించారు. దీన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు కేటాయింపునకు అనుమతి ఇచ్చారు. ఇందుకోసం ఎకరాకు రూ.20లక్షల చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీసీఎల్‌ఏ, యాదాద్రి కలెక్టర్ తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించింది.







# మెడికల్ కాలేజీకి ఎల్ ఓపీ వచ్చేనా?

## మరోసారి అప్పీల్‌కు వెళ్లిన అధికారులు

"యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి మెడికల్ కాలేజీ ఏర్పాటుపై ప్రతిష్టంభన తొలగడం లేదు. కాలేజీ ఎల్ఓపీ (లెటర్ ఆఫ్ పర్మిషన్)పై సందిగ్ధత కొనసాగుతున్నది. ఇప్పటికే రెండుసార్లు ఎల్ఓపీని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిరాకరించింది. దాంతో మెడికల్ కాలేజీ అధికారులు మరోసారి అప్పీల్‌కు వెళ్లారు. త్వరలోనే వర్చువల్‌గా మళ్లీ తనిఖీలు చేపట్టనున్నారు. ఈసారైనా అనుమతి వస్తుందా, లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ)

**త్వరలో వర్చువల్‌గా మళ్లీ తనిఖీలు**

**ఇప్పటికే రెండుసార్లు అనుమతి నిరాకరణ**

**అనువైన ఆస్పత్రి భవనం లేకపోవడమే కారణం!**

**ఈ ఏడాది కళాశాల ఏర్పాటుపై తొలగని సందిగ్ధత**



భువనగిరిలో ఏర్పాటు చేసే మెడికల్ కాలేజీ

కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు గతేడాది జూన్ 5న యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజీని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల తరగతులు ప్రారంభం అవుతాయని ఉత్తర్వుల్లో తెలిపింది. కాలేజీ నిర్మాణానికి రూ.183 కోట్లు కేటాయించింది. 433 పోస్టులను కూడా క్రియేట్ చేస్తూ జీఓ రిలీజ్ చేసింది. ఆ తర్వాత శ్రీలక్ష్మీనరసింహస్వామి మెడికల్ కాలేజీగా నామకరణం కూడా చేశారు. మొదట వంద సీట్లతో జీఓ ఇచ్చినప్పటికీ సరైన సదుపాయాలు లేవంటూ 50 సీట్లకు కుదించారు. పాత కలెక్టరేట్ భవనంలో మెడికల్ కాలేజీ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. యాదగిరిగుట్టకు మంజూరైన కాలేజీ భువనగిరిలో ఏర్పాటు చేస్తుండటంపై మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ పాత కలెక్టరేట్ భవనంలోనే ఏర్పాటు చేసేందుకు పనులు ముమ్మురం చేశారు.

### వసతులు లేవంటూ..

మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలంటే నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి తప్పనిసరి. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రక్రియ ఉంటుంది. కాలేజీ అధికారులు అనుమతికి దరఖాస్తు చేసుకుంటే.. ఎన్ఎంసీ బృందం తనిఖీలు నిర్వహిస్తుంది. అనుమతి ఇచ్చేందుకు వివిధ రకాల పారామీటర్లను పరిగణలోకి తీసుకుంటుంది. అయితే మొదటిసారి ఎన్ఎంసీ బృందం స్వయంగా విచ్చేసి తనిఖీలు నిర్వహించింది. ఆ తర్వాత అవసరమైన నిబంధనలు పాటించలేదంటూ, వసతులు లేవంటూ ఎల్‌వోపీని నిరాకరించింది. దాంతో మెడికల్ కాలేజీ అధికారులో అప్పీల్‌కు వెళ్లారు. అంతకంటే ముందు లేవనెత్తిన అభ్యంతరాలను సరిచేసుకునే ప్రయత్నం చేశారు. ఫ్యాకల్టీ, స్టాఫ్ రిక్రూట్‌మెంట్, ఇతర సదుపాయాలను కల్పించారు. అనంతరం ఎన్ఎంసీ అధికారులు వర్చువల్‌గా తనిఖీలు చేపట్టారు. ఇదే క్రమంలో రాష్ట్రంలోని పలు కళాశాలలకు అనుమతి వచ్చినప్పటికీ యాదాద్రి కాలేజీకి మాత్రం రాలేదు. రెండోసారి కూడా ఎల్‌వోపీకి ఎన్ఎంసీ నిరాకరించింది.

### మరోసారి అప్పీల్‌కు..

ఎల్ఓపీ విషయంలో ఇప్పటికే రెండు సార్లు ఎన్ఎంసీ ఎల్ఓపీని నిరాకరించడంతో కాలేజీ అధికారులు మరోసారి అప్పీల్‌కు వెళ్లారు. కళాశాల అనుమతిని పునఃపరిశీలించాలని ఎన్ఎంసీని కోరారు. ఇటీవల అన్ని రకాల డాక్యుమెంట్లు మళ్లీ సమర్పించినట్లు సమాచారం. మరోసారి నేషనల్ మెడికల్ కమిషన్ బృందం వర్చువల్‌గా తనిఖీలు చేపట్టనుంది. ఆ తర్వాత వాళ్లు కాలేజీ సమర్పించిన అన్ని రకాల వివరాలపై సంతృప్తి చెందితే ఎల్‌వోపీ వచ్చే అవకాశం ఉంటుంది.

### సమస్య ఎక్కడ?

కళాశాలకు ఎల్ఓపీ రాకపోవడానికి పలు కారణాలు చెప్తున్నప్పటికీ అసలు సమస్య జిల్లా ఆస్పత్రి భవనమేనని తెలుస్తున్నది. ఆస్పత్రి భవనం అనువుగా లేదని, చిన్న స్థలంలో ఉందని, పైగా చుట్టూ ఇండ్లు ఉన్నాయనేదే ప్రధాన కారణమని సమాచారం. ఆస్పత్రిలో మూడో ఫ్లోర్ నిర్మాణానికి ఇటీవల అనుమతులు కూడా వచ్చిన విషయం తెలిసిందే. అంతేగాక ఫ్యాకల్టీకి వసతిగృహాలు లేవు. సరిపడా సదుపాయాలు కూడా అందుబాటులో లేవు. త్వరలో కొత్త భవనం నిర్మాణం తర్వాత అందులోకి మారే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎల్ఓపీ వచ్చే రావచ్చన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది.


భువనగిరి కోర్టు ఆవరణలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

## క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: న్యాయశాఖలో ఉన్నవారికి మానసిక ఒత్తిడి అధికంగా ఉంటుందని, క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భువనగిరి కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.
క్రీడాకారులు మధ్య స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కే. జెండగే


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 9 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశమైన ఆయన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. పోలీస్ గౌరవ వందనం, బందోబస్తు ఏర్పాట్లు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రౌండ్‌లో మెడికల్ టీమ్‌తో వైద్య శిబిరం, నిరంతరం విద్యుత్ సరఫరాకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను గుర్తించి ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వివిధ శాఖల అభివృద్ధిపై శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఆస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్‌ప్రసాద్, పోలీసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సుంకిశాలలో మంత్రుల పర్యటన

- ప్రాజెక్టులో కూలిన గోడను సందర్శించిన ఉత్తమ్, తుమ్మల, మండలి చైర్మన్ గుత్తా
- టన్నెల్ ఓపెన్‌పై తుమ్మల అసహనం

పెద్దఅడిశర్లపల్లి/పెద్దవూర, ఆగస్టు 9: జంట నగరాలకు తాగునీరు అందించే సుంకిశాల పథకంలో కూలిన రిటైనింగ్ వాల్‌ను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్నం 2.55గంటలకు హెలికాప్టర్‌లో సుంకిశాలకు చేరుకున్న వారు 3.03గంటలకు ప్రమాదం జరిగిన పంప్ హౌస్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మెగా కంపెనీ అధికారులు, మెట్రో బోర్డు అధికారులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడి 4.04 గంటల నిమిషాలకు తిరిగి హెలికాప్టర్ హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు. కాగా, పరిశీలన సమయంలో మంత్రి తుమ్మల జల మండలి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఆల్మట్టి ఓవర్ ఫ్లో అవుతున్నది.. జూరాల, శ్రీశైలం నిండింది. మనకు వరద వస్తున్నది.. అయినా టన్నెల్ ఎందుకు ఓపెన్ చేశారని ప్రశ్నించా రు. అధికారులు టన్నెల్ ఓపెన్ చేయలేదని చెబుతూనే గేట్ తోసేందని చెప్పుకొచ్చారు. మంత్రి మా త్రం వరద వచ్చినప్పుడు లెవల్స్ చూసుకోవడం, గేట్ తోసి వేయకుండా జాగ్రత్త పడడం అధికారుల బాధ్యత కాదా అని ప్రశ్నించారు. అధికారులు మాత్రం ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదమూ లేదని, 2, 3 మాసాలు మాత్రమే ఆలస్యం అవుతుందని చెప్పుకొచ్చారు. చివరగా పడిపోయిన గోడ నిర్మాణం డిసెంబర్ ముందు జరిగిందా, డిసెంబర్ తర్వాత జరిగిందా అని అధికారులను మంత్రి నొక్కినొక్కి అడగగా జలమండలి అధికారి తడబడుతూ డిసెంబర్‌లోనే చెప్పారు. మంత్రుల పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షించారు. నల్లమల్ల అటవీ ప్రాంతానికి అనుకుని ఉండడంతో ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రత్యేక ఎస్కార్టు వాహనాలను ఏర్పాటు చేసి భారీగా పోలీసు బలగాలను మోహరించారు.


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రంలో నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి



సాగర్ నీటి కోసం ధర్నా చేస్తున్న రైతులు

## సాగర్ నీళ్ల కోసం రైతుల ధర్నా

- కల్వర్టు నిర్మించకపోవడంతో సమస్య

నేరేడుచర్ల(గరిడేపల్లి) ఆగస్టు 9 : నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి వారం రోజులైనా తమ భూములకు నీళ్లు అందడం లేదని గరిడేపల్లి మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఎల్–9 పరిధిలోని గానుగబండ, హనుమంతులగూడెం, కొండాయిగూడెం, గంగానగర్ గ్రామాలకు ఇంతవరకు జాడ లేదంటూ శుక్రవారం గారకుంట తండా వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. గరిడేపల్లి నుంచి అలింగాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్, అర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గారకుంటతండా వద్ద సాగర్ కాల్వపై కల్వర్టు నిర్మించడం లేదని రైతులు తెలిపారు. దాంతో గూనల్లో చెత్త పేరుకుపోయి నీళ్లు రావడం లేదని పేర్కొన్నారు. దాంతో చివరి భూములు నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందని వివరించారు. సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో రైతులు పరమేశ్, అప్పయ్య, అంజిరెడ్డి, నరసింహారావు, నాగేంద్రబాబు, ఆంజనేయులు, నాగేశ్వర్‌రావు, నరసింహారావు, వెంకయ్య, వీరయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

# 26 గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల



సాగర్ డ్యామ్ వద్ద సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

నందికొండ, ఆగస్టు 9 : కృష్ణమ్మ వరద జోరుతో నాగార్జున సాగర్ జలాశయం తొణికిసలాడుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 2,94,009 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా శుక్రవారం 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు. 4 గేట్లు 10 అడుగులు, 22 గేట్లు 5 అడుగుల ఎత్తుతో 2,77,453 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ నెల 5న నీటి విడుదల ప్రారంభం కాగా, రోజూ 2 నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు 587.30 (305.6838 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జురాల, శ్రీశైలం ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండి ఉండడంతో వాటిల్లోకి వచ్చిన వరద వచ్చినట్టే సాగర్‌కు చేరుకుంటున్నది. నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లతోపాటు ఎడమ కాల్వ ద్వారా 8,367 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 8,452 క్యూసెక్కులు, క్రస్ట్ గేట్ల ద్వారా 2,29,886 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీబ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. సాగర్ క్రస్ట్ గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదలను చూసి సంతోషించేందుకు పర్యాటకులు నిత్యం తరలివస్తున్నారు. డ్యామ్ కొత్త బ్రిడ్జి, శివాలయం పుష్కరఘాట్, జలవిద్యుత్ కేంద్రం, డ్యామ్ పిల్లర్, లాంచీస్టేషన్, దయ్యాల గండి పరిసరాలు సందడిగా కనిపిస్తున్నాయి.

### పులిచింతలలో 11 గేట్ల ద్వారా..

చింతలపాలెం: పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 (45.77 టీఎంసీలు) అడుగులకు గానూ 167.714 (35.1981 టీఎంసీలు) అడుగుల వద్ద మేరకు నీరు చేరింది. ఇన్‌ఫ్లో 2,30,031 క్యూసెక్కులు ఉండడంతో 11 గేట్లను ఎత్తి 2,30,114 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో గేట్ల నుంచి 12,000 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా మొత్తం 2,42,114 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. 12,000 క్యూసెక్కుల నీటితో 4 యూనిట్ల ద్వారా 80 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

